ప్రజాశక్తి
శుక్రవారం 30 మే, 2025
5
శ్రీకాకుళం

చెరువులు జలకళ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో జలకళ ఉట్టిపడుతుంది. ఎండా కాలంలో ఎండిపోయిన చెరువులు, చెమ్మలు నీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. మండలంలోని సీతాపురం, గోవిందపురం, పాతటెక్కలి తదితర గ్రామాల్లో చెరువులకు నీరు చేరింది. ఈ ఏడాది ఇలాగే వర్షాలు కురిస్తే పంటలకు నీటి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పశువులకూ నీరు లేక ఇబ్బంది పడ్డామని రైతులు తెలిపారు.

చెరువులో చేరిన వర్షపునీరు

సాగుకు సానుకూలం

- రుతుపవనాలు, అల్పపీడనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం
- విత్తనాలను సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం
- ఇప్పటికే ఆర్ఎస్‌కెలకు 12 వేల కింటాళ్లు తరలింపు

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశించడంతో జిల్లాలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం, వాయుగుండ ప్రభావం తోడవ్వడంతో వర్షాలు నిరంతరం కొనసాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అటు అధికారులు, ఇటు రైతులు సన్నద్ధమవుతున్నారు. పంటల సాగు, విత్తనాల పంపిణీపై వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే ఒక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా అవసరాలను గుర్తించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల అందజేతకు గత నెలలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే వాటిలో కొన్ని మార్పులు చేసి తాజాగా కొత్త ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటికే జిల్లాకు 12 వేల క్వింటాళ్లు విత్తనాలు చేరాయి. వీటిని జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కె)కు తరలించారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 2025 ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 4 లక్షల 7 వేల 488 ఎకరాల్లో వేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేశారు. సజ్జలు 90 ఎకరాల్లో సాగు ఉండొచ్చని అధికారులు అంచనాలు రూపొందించారు. మొక్కజొన్న 23,873 ఎకరాలు, రాగులు 43 ఎకరాలు వేయనున్నారు. పప్పు ధాన్యాలకు సంబంధించి కంది, పెసర, మినప పంటలను కలిపి మొత్తం 388 ఎకరాల్లో రైతులు సాగు చేసే అవకాశం ముందని అంచనా వేశారు. వేరుశనగ 433 ఎకరాలు, నువ్వులు 30 ఎకరాల్లో సాగు అవుతుందని భావిస్తున్నారు. పత్తి 3,125 ఎకరాల్లో, గోగు పంట 98 ఎకరాల్లో సాగు చేయనున్నారు. చెరుకు 2,623 ఎకరాల మేర సాగయ్యేలా ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాకు చేరుకున్న వరి విత్తనాలు

40,596 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు

ప్రస్తుత ఖరీఫ్‌కు అన్ని రకాల విత్తనాలు కలిపి 40,596 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అందులో వరి రకం విత్తనాలు 38,499 క్వింటాళ్లు, పచ్చిరొట్ట, కట్టెజనుము తదితర విత్తనాలు 2,097 క్వింటాళ్లు అవసరం పడతాయని ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో ఈ ఏడాది ఎంటియు 1061 రకం సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ రకం విత్తనాలను సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ 8,000 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపింది. అదేవిధంగా స్వర్ణ రకం విత్తనాలు 7,900 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపారు.

జిల్లా అవసరాలకు 69,050 మెట్రిక్ టన్నుల ఎరువులు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల ఎరువులు కలిపి మొత్తం 69,050 మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు ప్రతిపాదనలను పంపారు. అందులో ప్రధానమైన యూరియా 42,225 మెట్రిక్ టన్నులు కావాలని ప్రభుత్వానికి నివేదించారు. డిఎపి 17,206 మెట్రిక్ టన్నుల అవసరమని ప్రతిపాదించారు. మోనోపాస్ఫేట్ 4,174 మెట్రిక్ టన్నులు, సూపర్‌పాస్ఫేట్ ఎరువులు 296 మెట్రిక్ టన్నులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా కాంప్లెక్స్ ఎరువులు 5,149 మెట్రిక్ టన్నుల మేర ఎరువులు ఈ సీజన్‌లో అవసరం పడతాయని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆర్ఎస్‌కెల్లో 10,367 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 37,707 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదించారు.

50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటంతో భూసారం క్రమేణా దెబ్బతింటోంది. భూమిలో సేంద్రీయ పదార్థం దెబ్బతిని నీరు నిల్వ చేసుకునే సామార్థ్యం తగ్గిపోతోంది. దీంతో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఖరీఫ్‌లో 1000 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఇందులో కట్టె జనుము 412 క్వింటాళ్లు, జీలుగ 873 క్వింటాళ్లను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. వీటిని 50 శాతం రాయితీపై అందించనున్నారు.

రైతుల అవసరాలకనుగుణంగా విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. జిల్లా అవసరాల కనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి సరఫరా వచ్చిన వెంటనే రైతులకు అందిస్తాం. ఇప్పటికే పచ్చి రొట్ట వితనాల పంపిణీని ప్రారంభించాం. రైతు భరోసా కేంద్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలకనుగుణంగా వరి, ఇతర రకాల విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాకు 12 వేల క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. రైతులకు అందించేందుకు ఆర్ఎస్‌కెలకు తరలించాం.

– కె.త్రినాథస్వామి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నైరుతి రుతుపవనాలపై సన్నద్ధత

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండలస్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చెరువుల గట్లను ఉమ్మడిగా తనిఖీ చేసి, వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువుల పంపిణీపై కార్యాచరణ రూపొందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు నిల్వ చేసిన దుకాణాలపై లైసెన్స్‌లు రద్దు చేయాలని హెచ్చరించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని తెలియజేశారు. నదీ పరివాహక గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

కాజ్‌వేలు రోడ్లపైకి వరద నీరు వచ్చే ప్రాంతాల్లో వాహనాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఇరిగేషన్, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతేడాది హిరమండలం–కొత్తూరు మధ్య రోడ్డు పైకి వరద నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశం ద్వారా జిల్లా యంత్రాంగం రుతుపవనాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, జిల్లా ప్రజల రక్షణే తమ ముఖ్య బాధ్యతగా భావిస్తూ తగిన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిపిఒ భారతీ సౌజన్య, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, విపత్తుల నిర్వహణశాఖ అధికారి రాము, శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఎంహెచ్ఒ అనిత, ఇరిగేషన్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, మత్స్యశాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

వాయు'గండం'

శ్రీకాకుళం ప్రతినిధి: వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంగా ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. గురువారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. మబ్బులు కమ్ముకున్నాయి. జిల్లాలో అత్యధికంగా వజ్రపుకొత్తూరులో 16.5 మి.మీ వర్షపాతం నమోదయింది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. పలాసలో 4.5మి.మీ వర్షం పడింది. సోంపేట మండలం బాతుపురం, మెళియాపుట్టిలో 4.25 మి.మీ చొప్పున వర్షం కురిసింది. టెక్కలిలో 4 మి.మీ, నందిగాంలో 3.25 మి.మీ, రణస్థలం మండలం గరికపాలెంలో 2.5 మి.మీ వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి ఈ నెల 31 వరకు మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించారు. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

మాట్లాడుతున్న కృష్ణదాస్

సమన్వయంతో ముందుకు...

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

నరసన్నపేట : వైసిపి కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ సూచించారు. స్థానిక మేఘన కన్వెన్షన్ హాల్‌లో వైసిపి యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అధ్యక్షతన వైసిపి నియోజకవర్గ అనుబంధ విభాగాలు, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు ప్రమాణస్వీకారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయి వరకు వైసిపి కమిటీలను నియమించామని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలు ఏర్పాటు చేశామని, పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అంకిత భావం, కట్టపడేతత్వం ఉండే వ్యక్తులకు పార్టీ కమిటీల్లో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మాజీ స్పీకర్, పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, పార్లమెంట్ పరిశీలకులు ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస నియోజవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్, టౌన్ ప్లానింగ్ అధికారిపై

పరువు నష్టం దావా

ఇచ్ఛాపురం: తనపై అకారణంగా ఆరోపణలు చేసి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్‌పై రూ.19 లక్షలకు పరువు నష్టం దావా వేస్తూ... లీగల్ నోటీసు పంపించినట్లు వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టంలోని సెక్షన్–16 (1) కింద వార్డు సభ్యులుగా అనర్హత పొందానని ఆ మేరకు ఒక నోటీస్‌ని పంపుతూ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఇన్‌ఛార్జి కమిషనర్ సనప వినయ్‌ప్రసాద్ సదరు నోటీస్‌లో పైసెక్షన్‌కి సంబంధం లేని, అసత్యపు ఆరోపణలు గురించి పత్రిక ప్రకటన ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. అయినా సదరు అధికారి ప్రకటన ఇచ్చి నా పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని అన్నారు. దీంతో పాటు ఈ ఏడాది మార్చి 29న సదరుపై సెక్షన్‌కు సంబంధం లేని అసత్యపు ఆరోపణలను చైర్‌పర్సన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు ఎజెండాలో చేర్చి మైక్‌లో చదివించి నా పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని అన్నారు. నా పరువు ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు ఇద్దరూ రూ.19 లక్షలు చెల్లించాలని, లేని పక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలకు లీగల్ నోటీస్టులు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిచినట్లు తెలిపారు. దీంతో వైస్ చైర్‌పర్సన్ అనర్హత అంశంపై రగులుతున్న వివాదం రోజూ రోజుకీ కొత్త మలుపు తిరుగుతున్నాయి.

వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నేర నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు టెక్కలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు గురువారం ఉదయం కార్డాన్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు నిర్వహించారు. ఈ మేరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిఐలు, ఎస్ఐలు ఆధ్వర్యాన సిబ్బంది వారి పరిధిలో ఉన్న పలు వార్డు, గ్రామాల్లో కార్డాన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి ఊరు చివర ప్రాంతాల్లో సోదాలు చేసి అక్రమ మద్యం, గంజాయి, నిల్వలపై ఆరా తీశారు. పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, కొత్త, అనుమానిత, నేర చరిత్ర కల్గిన వ్యక్తులు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. వారి జీవన విధానం, వృత్తి విధానంపై ఆరా తీసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టి, నేర నియంత్రణ చర్యలు చేపడ్తున్న పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్ తనిఖీల్లో ఏటువంటి, సరైన వాహనపత్రాలు లేని ద్విచక్ర వాహనాలు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సిఐలు రామారావు, అంబటి విజయకుమార్, ఎం.శ్రీనివాస రావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమర్థవంతంగా డీ-అడిక్షన్ కేంద్రాలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అక్రమంగా తయారవుతున్న మద్యం (ఇలిసిట్లీ డిస్టిల్ లిక్కర్ – ఐడి లిక్కర్) వల్ల తలెత్తుతున్న ఆరోగ్య, ఆర్థిక సమస్యలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలపై, ముఖ్యంగా మద్యం బారిన పడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై కలెక్టరేట్‌లో ఎక్సైజ్ శాఖ అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐడి మద్యం వల్ల బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. ఈ కుటుంబాలకు తక్షణమే ప్రత్యామ్నాయ జీవనోపాధిని అందించాలని సూచించారు. మద్యం తయారీకి ఉపయోగించే ముడి సరుకులపై నియంత్రణ పెట్టాలన్నారు. ఇందులో ప్రధాన పాత్ర పోషించే వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీ–అడిక్షన్ కేంద్రాల సమర్థ వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కేర్ కమిటీ ఆధ్వర్యాన చేపడుతున్న కార్యకలాపాలను సమీక్షించారు. ఇప్పటివరకు ఈ కమిటీ ద్వారా 16 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, 595 మంది పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీ–అడిక్షన్ కేంద్రాన్ని తాను ఒకసారి సందర్శించినట్లు గుర్తు చేసుకున్నారు. ఈ కేంద్రంలో తొమ్మిది మంది చేరగా, ఏడు మంది విజయవంతంగా పునరావాసం పొందినట్లు అధికారులు వెల్లడించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఐడి మద్యం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సమస్యలు, కుటుంబాలపై ప్రభావం, విద్యాభ్యాసం, ఉపాధి వంటి అంశాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చేలా చైతన్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతినెలా 2వ, 4వ శనివారాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, డీ–అడిక్షన్ కేంద్రాలను మరింత సమర్థంగా ఉపయోగించుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఎక్సైజ్ రామచంద్రరావు, అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గేట్ వద్ద నిరసన తెలుపుతున్న లారీడ్రైవర్లు

టోల్ గేట్ వద్ద లారీ డ్రైవర్లు నిరసన

పలాస: మండలంలోని జాతీయ రహదారి లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద ఎపి న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్ అసోసియేషన్ ఆధ్వర్యాన లారీ యజమానులు టోల్ గేట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహారథి మాట్లాడుతూ బుధవారం రాత్రి విజయవాడకు చెందిన లారీ జార్ఖాండ్ నుంచి కాకినాడకు స్టీల్ సామాన్లు తయారు చేసేందుకు సంబంధించిన సామగ్రిని తరలిస్తున్నారని అన్నారు. లారీలో పరిమితికి మించి లోడ్‌తో వెళ్తున్నారని, అదనంగా డబ్బులు చెల్లించాలని లారీడ్రైవర్‌పై ఒత్తిడి చేశారని అన్నారు. దీంతో సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని తెలిపారు. రాత్రి సమయంలో సుమారు రెండు గంటల పాటు లారీను టోల్ సిబ్బంది నిలిపివేశారని పేర్కొన్నారు. లారీడ్రైవర్‌ను ఇబ్బంది పెట్టడంతో 112 టోల్ ఫ్రీ నంబరు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పోలీసులు టోల్ గేట్ వద్దకు చేరుకున్నారని తెలిపారు. డ్రైవర్ మద్యం తాగి ఉంటాడనే అనుమానంతో స్టేషన్‌కు తీసుకెళ్లి పరీక్షించి తాగలేదని నిర్ధారించుకున్నారని తెలిపారు. ఇతర వాహనాలు వెళ్లకుండా బేరియర్లకు లారీ అడ్డుగా పెట్టడంతో రూ.1,030 జరిమానా విధించారని చెప్పారు. అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై పోలీసులు విడిచి పెట్టారని తెలిపారు. దీంతో నానా కష్టాలు పడి తిరిగి లారీ వద్దకు డ్రైవర్ వెళ్లారని అన్నారు. గేట్ వద్ద బరువు తేడా ఉందని సిబ్బంది అన్నారని, అలా తేడా ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. రాత్రి సమయాల్లో ఇలా చేస్తున్నారని వివరించారు. అదనంగా ఏలా వసూలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరలా ఇలాంటి ఘటనలు పునరావృతమైతే టోల్ గేట్ వద్ద లారీ డ్రైవర్లతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. టోల్ గేట్ ప్రవేశం సమయంలో బరువు కనిపించే విధంగా బోర్డులను ఏర్పాటు చేయకుండా డ్రైవర్లు ఇబ్బంది పెట్టి చెప్పిన టోల్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు టోల్ గేట్ అధికారులకు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. నిరసనలో రాష్ట్ర జాయింట్ కార్యదర్శి శేషగిరి లారీ యజమానులు రాజేష్ బాలకృష్ణ భాస్కరరావు, రామకృష్ణ సూర్యనారాయణ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ విషయాన్ని లారీ యజమానికి సమాచారం ఇవ్వడంతో టోల్ గేట్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. చివరకు టోల్ గేట్ వద్ద అలా జరగకుండా చూస్తామని టోల్ గేట్ ఉన్నతాధికారులు ఫోన్లలో చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

రేపట్నుంచి అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, భవిష్యత్ తరాల కోసం పుడమి సంరక్షణ అనే అంశంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పర్యావరణ ఇంజినీర్ కరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. 31న ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులకు న్యూ సెంట్రల్ స్కూల్‌లో ఉదయం పది గంటలకు, జూన్ 4న ప్రభుత్వ జూనియర్ బాలురు, బాలికల కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొవాలన్నారు. పచ్చదనాన్ని పెంపునకు పైడిభీమవరం, టెక్కలి, వివిధ గ్రామాల్లో ఐదు వేల మొక్కలు నాటనున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి గుడ్డ సంచులను కూడా వితరణ చేయనున్నారు. జూన్ 5న గ్రీన్ ర్యాలీ, సమావేశాలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9494590115, 9010854409 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

Roc.No.1517/2024/ఏ1 తేది 29-05-2025 ఇచ్ఛాపురం పురపాలక సంఘం

బహిరంగ వేలాం నోటీసు

ఇచ్ఛాపురం పురపాలక సంఘంనకు సంబంధించి 2025-2026 సంవత్సరమునకు గాను ఈ దిగువన తెలిపిన షాపు రూములు అనగా పాత పంచాయతీ ఆఫీసు షాపులు మరియు కార్టు స్టాండు షాపులు, ఖాళీగా ఉన్న షాపురుములుకు 03 మూడు సంవత్సరములకు నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదిక పై లీజు కిచ్చుటకు గాను తేది 13-06-2025న ఉదయం గం॥ 11-00లకు ఈ పురపాలక సంఘం కమిషనరు వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని ఈ పురపాలక సంఘ కార్యాలయము ఆవరణలో బహిరంగ వేలాం పాటలు నిర్వహించబడును.

వ.నెం	వేలాం పాటల వివరములు	వేలాం ధరావత్తు రూ	సాల్వెన్సి సర్టిఫికేట్ మొత్తం రూ.	
1	పాత పంచాయతీ ఆఫీసు షాపులు, షాపు నెం 1. జనరల్ కేటగిరి: 01,03,04,05&06 2. SC కేటగిరి: 02 (మెయిన్ రోడ్డు)	రూ.20,000/-లు	2,00,000/-	రిజిస్ట్రేషన్ చేయు సమయంలో రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించ వలసియుండును
2	కార్టు షెడ్ షాపులు షాపు నెం. 1. జనరల్ కేటగిరి: 01,02,03,04 (గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు)	రూ.20,000/-లు	2,00,000/-	

షరతులు :
1. వేలాం పాటలో పాల్గొన దలచినవారు దరఖాస్తుతో పాటు సాల్వెన్సి సర్టిఫికేట్‌తో పాటు E C సర్టిఫికేట్ జత చేసి తేది 11-06-2025 సా.గం.5:00లోగా ఈ కార్యాలయంలో దాఖలు చేయవలెను. మరియు ధరావత్తు సొమ్మును వేలాం పాట సమయంనకు ఒక గంట ముందు ఈ కార్యాలయంలో చెల్లింపు చేయవలయును.
2) తేది 01-06-2025 తరువాత తీసిన E C సర్టిఫికేట్‌లు మాత్రమే చెల్లుబాటు అగును.
3) వేలాం పాటలో పాల్గొన దలచినవారు ఈ కార్యాలయంనకు ఎటువంటి బకాయిలు ఉండరాదు.
4) మిగతా వివరములకు కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరు.

కమిషనరు
ఇచ్ఛాపురం పురపాలక సంఘము

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
E.P No.94/2020 in O.S. No.329/2015

Between:
Korada Sesibhushana Rao .....-DHr/ Plaintiff
And
Sisti Jagadeeswara Rao .....Jdr/Defendant

పై నెంబరు అమలు మొత్తం వగైరాలు గాను ప్రతివాది/జెడిఆర్ తాలుకా ఈ దిగువ తెలియపర్చిన షెడ్యూల్ దాఖలా ఇల్లు వగైరాలు **తే 02-07-2025దీన, ఉదయం గం॥ 10-30ని॥లకు తగాయతు 5-00గం॥ల** వరకు వేలం జరుగును. సదరు వేలంలో పాడదలచిన వారు ఆ సమయాన వచ్చి వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చును. వేలం షరతులు డిక్రీ హోల్డరు తరుపు న్యాయవాది వద్ద గాని లేదా పై కోర్టువారి సూపరింటెండెంట్ వారిని గాని అడిగి తెలుసుకోవలెను.

వేలం వేయబడు ఆస్థి షెడ్యూల్ వివరములు

SCHEDULE : Site measuring 29 Sq Yards, or 24.24 Sq Mtrs out of being un-divided and un- specified total extent of 200 Sq Yards of 167.226 Sq Mtrs together with a finished Flat bearing FLAT No.G1, in Ground Floor measuring super built up area of 880 sft(including common areas and car parking) of "SAI TOWERS" bearing Plot No. 15 south part of LP No. 33/99 approved by Regional Deputy Director of Town and country planning, Visakhapatnam, situated at Sundar Nagar Lay-out covered by old survey No. 88, New Survey Nos. 276/2 a 277/1 of Balaga Rural, near Indira Nagar Colony, Chapuram Panchayat, Srikakulam Mandal, Srikakulam District and Srikakulam Registration Sub-District measurements from its East to West 60 feet or 18.288 Mtrs, North to South 30 feet or 9.14 Mtrs bounded by:
EAST : Layout Road, **SOUTH :** Layout Road
WEST : RCC House in Plot No-16, **NORTH:** RCC House in Plot No-15 North Part,
Boundaries of the residential "FLAT No. G1 in Ground Floor
EAST : Parking area and Road, **SOUTH :** Road,
WEST : RCC House in Plot No-16, **NORTH:** RCC House in Plot No-15 North Part

డిక్రీ హోల్డరు విలువ : Rs. 20,00,000/-
అమీను విలువ : Rs. 30,00,000/-
మార్కెట్ విలువ : Rs. 14,78,500/-
(మహారాజశ్రీ కోర్టువారు ఆదేశాల మేరకు)

యెరుకోల మురళీమోహనరావు
అడ్వకేట్, ఒన్ వే ట్రాఫిక్ రోడ్, శ్రీకాకుళం, సెల్ : 9440105598
స్థలం : శ్రీకాకుళం
తేది : 29/5/25

రైతులతో మాట్లాడుతున్న త్రినాథరావు

తోటపల్లి కాలువ పరిశీలన

రణస్థలం రూరల్: కలెక్టర్ ఆదేశాలు మేరకు మండలంలో తోటపల్లి కాలువ ఆయకట్టు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు గురువారం పరిశీలించారు. వేల్పురాయి, కమ్మసిగడం, బంటుపల్లి రైతులతో ముఖాముఖీ చర్చించారు. గడిచిన సంవత్సరంలో కాలువ నీరు విడుదల అయ్యిందా? లేదా? ఈ పంట నమోదులో నీటి వసతి, పంటల స్థితి గతులపై రైతులతో, వ్యవసాయశాఖ సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి డి.విజయభాస్కర్, విఎఎలు పాల్గొన్నారు.

కాటాలను, ఇ-పాస్ మిషన్లను పరిశీలిస్తున్న అధికారులు

సరుకుల పంపిణీకి చర్యలు

లావేరు: ఎండియు ఆపరేటర్లు ద్వారా ప్రజాపంపిణీ విధానాన్ని రద్దుచేసిన ప్రభుత్వం జూన్ నుంచి గ్రామాల్లో పాతపద్ధతి ద్వారా రేషన్ డిపోల్లో డీలర్లు ద్వారా వారి లాగిన్‌లోనే కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. మండలంలోని 58 రేషన్ డిపోల్లోని డీలర్లు గురువారం లావేరు తహాశీల్దార్ కార్యాలయంలో తూనికలు, కొలతల శాఖాధికారులు కాటాలను పరిశీలించారు. ఎలా ఉన్నాయి, ఏ మేర పనిచేస్తున్నాయన్న విషయాన్ని పరిశీలించారు. జూన్ ఒకటి నుంచి డిపోల్లోనే రేషన్ సరుకుల పంపిణీకి ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లోనే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తహాశీల్దార్ రాజశేఖర్ తెలిపారు.

రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సమావేశానికి రెడ్డి శాంతి హాజరు

పాతపట్నం : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడలోని తాడేపల్లిలో ఉన్న క్యాంపు కార్యాలయంలో గురువారం వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో క్రమశిక్షణ కమిటీకి సంబంధించిన విధివిధానాలు, నియమాలను గురించి చర్చించి వాటి ప్రణాళికను రూపొందించారు.

పాల్గొన్న రెడ్డి శాంతి

టైలరింగ్‌తో మెరుగైన ఉపాధి

కవిటి: టైలరింగ్‌తో మెరుగైన ఉపాధి లభిస్తుందని, మహిళలు టైలరింగ్ శిక్షణ ఉపయోగించుకుని ఆర్థిక స్థిరత్వం సాధించాలని ఎంపిడిఒ విశ్వేశ్వరరావు సూచించారు. కవిటి తహాశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎఫ్‌పిఒ క్లస్టర్ సెంటర్‌లో జరుగుతున్న టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. అక్కడ టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి శిక్షణ ఎలా జరుగుతుందో తెలుసుకున్నారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ ఎంపిడిఒ అబ్దుల్ ఖాన్ పాల్గొన్నారు.

2 నుంచి వైద్య శిబిరం

ఇచ్ఛాపురం : జూన్ రెండు నుంచి ఏడో తరగతి వరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యాన కామ్యూనిటీ భవనంలో మెగా అక్యుప్రెషర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, పైడిశెట్టి దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరానికి ప్రాజెక్టు చైర్మన్‌గా పాక వెంకటేష్‌రెడ్డి వ్యవహరిస్తారన్నారు. రోజూ ఉదయం 9 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నమోదు ఫీజు ఏ రోజుకారోజు రూ.వంద చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 8686005235 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ శిబిరంలో బిపి, వెన్ను నొప్పి, చేతులు, కాళ్లు, సున్నితత్వం తగ్గడం, కడుపు సమస్యలు, శ్వాస సంబంధిత సమస్యలు, సుగర్, స్థూలత, సైటికా నొప్పి, కీళ్ల నొప్పులు, సర్వైకల్ నొప్పి, థైరాయిడ్, దీర్ఘకాలిక తలనొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తూచ్... అదేం లేదు

కవిటి: మండలంలోని లండారిపుట్టుగ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ఈశ్వరరావు కార్యాలయానికి వస్తున్న వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడానికి తాను సచివాలయానికి వెళ్తే తనతో దురుసుగా మాట్లాడడమే కాకుండా నేను ఉన్నంతకాలం నీ పని జరగదంటూ తనను హెచ్చరించారని అదే గ్రామానికి చెందిన టి.దినేష్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పలు పత్రికల్లో (ప్రజాశక్తి కాదు) కథనాలు కూడా వెలువడ్డాయి. దీనిపై స్థానిక ఎంపిడిఒ విశ్వేశ్వరరావు గురువారం లండారిపుట్టుగ సచివాలయానికి చేరుకుని విచారించారు. అయితే సదరు ఫిర్యాదుదారు విచారణకు హాజరు కాలేదు. దీంతో ఎంపిడిఒ ఈశ్వరరావుకు ఫోన్ చేస్తే తూచ్.. అదేం లేదు. ఏదో అనుకోకుండా జరిగిపోయింది. దినేష్ చాలా మంచివాడు అంటూ కితాబిచ్చాడు. అంతేకాకుండా తనకు ఇప్పుడు ముఖ్యమైన పని ఉందని, తర్వాత వచ్చి కలుస్తానని చల్లగా చెప్పాడు. దీంతో చేసేది లేక ఎంపిడిఒ ఈశ్వరరావుకు పలు సూచనలు, సలహాలు అందించారు. మనకి ఎన్ని సమస్యలు ఉన్నా సచివాలయానికి వచ్చేవారితో సౌమ్యంగా, స్నేహపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. మరోవైపు సచివాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోందని, అన్నీ తానై చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఈశ్వరరావు ఎంపిడిఒకి తన సమస్య మొరపెట్టుకున్నాడు. ఈ విచారణలో డిప్యూటీ ఎంపిడిఒ అబ్దుల్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి రూప పాల్గొన్నారు.

విచారిస్తున్న ఎంపిడిఒ విశ్వేశ్వరరావు

సిఎంకు అభినందనలు

పాతపట్నం: 1995 నుంచి మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షునిగా ఎపి సిఎం నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కడపలో నిర్వహిస్తున్న మహానాడులో గురువారం కలిసి అభినందిస్తూ... శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఏకగ్రీవంగా ఎన్నుకున్న పొలిట్‌బ్యూరో సభ్యులను, మంత్రులను ఎమ్మెల్సీలను, సహచర ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని అమీన్ సాహెబ్‌పేటలో ఉమాచంద్రశేఖర్ స్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ ప్రతిష్ట సందర్భంగా గురువారం నిర్వహించిన జలయాత్రలో చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్ పత్రీ తవిటయ్య, కో-ఆప్షన్ సభ్యులు సాలీన ఢిల్లీ యాదవ్ పాల్గొన్నారు.

రెవెన్యూశాఖలో 'పైసా వసూల్'

- ఒక్కో పనికి ఒక్కో రేటు
- పని అవ్వాలంటే చేయి తడపాల్సిందే

ప్రజలకు సేవ చేస్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటాం. లంచం లేకుండా చూస్తాం. అంటూ ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రస్తుతం ఏ పని కావాలన్నా ఒక రేటు, చేయి తడపందే కదలని ఫైల్, ఇది బూర్జ రెవెన్యూ శాఖ లీలలు.

తహాశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి- బూర్జ

శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గం మారుమూల మండలం బూర్జ. గత ప్రభుత్వం సత్వర పనులు జరిగేందుకు వీలుగా అన్ని గ్రామ పంచాయతీల్లోనూ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. దీనిద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో ప్రజలకు వ్యయ, ప్రయాసలు తగ్గాయి. అయితే ప్రస్తుతం మండల ప్రజలకు కుల, ఆదాయ, లేటు బర్త్ సర్టిఫికెట్లు, రైతులకు అవసరమైన వన్ బి, అడంగల్ పత్రాల కోసం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ప్రతి పనికి ఒక రేటు...

రెవిన్యూ శాఖలో ఒక్కో పనికి ఒక రేటు. ఆ ప్రకారంగా ముడుపులు చెల్లిస్తేనే ఫైలు ముందుకు కదులుతున్నాయని మండల ప్రజలు, రైతులు, ఆరోపిస్తున్నారు. తమకు కావాల్సిన పత్రాల కోసం డబ్బులు చెల్లించనిదే పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు తప్పని అవస్థలు...

ముఖ్యంగా రైతులు తమ భూములను కొనుగోలు, విక్రయాలు జరిపే సమయంలో తమ భూమి యొక్క వివరాల కోసం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్తే తమ భూమి వివరాలకు సంబంధించి కంప్యూటర్‌లో లాక్‌చేసి ఉండడంతో పని జరగక తిరిగి వెనక్కి రావాల్సిన పరిస్థితి దాపురిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూశాఖ అధికారులతో పాటు విఆర్ఒ, కంప్యూటర్ ఆపరేటర్ల వద్దకు తీసుకురాగా కొంత మొత్తం చెల్లిస్తేనే లాక్ తీయడం అవుతుందని చెబున్నారని రైతులు వాపోతున్నారు. చేసేదేమీ లేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో అధికారులు, సిబ్బంది అడిగిన మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. అలాగే ప్రస్తుతం భూముల రీ సర్వే జరగడంతో ఒకరి భూమి ఇంకొకరి పేరుతో నమోదు కావడంతో తిరిగి ఆ భూమిని తమ పేరుపై నమోదు కావడానికి రెవెన్యూ శాఖ సిబ్బంది చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా మరికొంత మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రెవెన్యూ శాఖ అధికారుల తీరు తమకు ఆందోళన కలిగిస్తుందని, ప్రతి పనికి ఒక రేటు, చేయి తడిపితేనే పనులు జరుగుతాయని, లేకుంటే ఫైల్‌ను పక్కన పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే సిబ్బంది, అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం ఇక్కడ ఇంత జరుగుతున్నా పట్టించుకోకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ముఖ్యంగా ఇక్కడ కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తున్నాడని, ఇప్పటికైనా రెవెన్యూ శాఖలో జరుగుతున్న వ్యవహారంపై విచారణ జరిపి, చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని తహాశీల్దార్ వై.వి.పద్మావతి వద్ద ప్రస్తావించగాపై ఈ వ్యవహారం తన దృష్టికి రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

భూముల వివరాలు లాక్ చేస్తున్నారు...

భూముల వివరాలకు లాక్ చేస్తున్నారు. సిబ్బంది అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అనుకున్న మొత్తాన్ని చెల్లిస్తేనే లాక్ తీస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటును నిర్ణయించారు. సిబ్బంది అడిగిన డబ్బును చెల్లిస్తేనే పనులు జరుగుతున్నాయి.

- మజ్జి నరసింగరావు, ఎంపిటిసి ప్రతినిధి, నీలంపేట

డబ్బులు చెల్లించినా పని జరగలేదు...

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రెవెన్యూ శాఖ సిబ్బంది డిమాండ్ చేసిన మొత్తాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించాను. అయినప్పటికీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయలేదు. వేలాది రూపాయలు తీసుకున్నప్పటికీ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. రెవెన్యూ శాఖలో సిబ్బంది ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధి.కారులు చర్యలు చేపట్టాలి.

- అంపోలు రాజు, రైతు, అన్నం పేట

తైక్వాండో పోటీల్లో సత్తా చాటాలి

శ్రీకాకుళం: కటక్ వేదికగా మే 30 నుంచి జూన్ 1 వరకు జరగనున్న 9వ జాతీయస్థాయి ఒపెన్ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి విజేతలుగా తిరిగి రావాలని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను సూచించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను ఆయన అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో కూడా రాణించి జిల్లాకి పేరు ప్రతిష్టలను తీసుకురావాలన్నారు. ఒపెన్ నేషనల్ పోటీలకు హాజరయ్యేందుకు పయనమైన జిల్లా క్రీడాకారులను అసోసియేషన్ ప్రతినిధి సుధీర్ వర్మతో కలిసి అభినందించారు. ఈ జట్టుకు కోచ్‌గా మజ్జి గౌతమ్, మేనేజర్‌గా హేమంత్ ఖాన్‌లు వ్యవహరించనున్నారు.

విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ రమణ

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఆమదాలవలస: మండలంలోని నెల్లిపర్తి పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై గురువారం డిఎల్‌పిఒ ఐ.వి.రమణ విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన శెట్టి నర్సింగరావు పంచాయతీ నిధులు సర్పంచ్ దుర్వినియోగం చేశారని ఫిర్యాదు చేయడంతో దీనిపై డిఎల్‌పిఒ నెల్లిపర్తి గ్రామానికి చేరుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు ఆరోపణల మేరకు పంచాయతీ రికార్డులు పరిశీలించారు. తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎ.గోపాలరావు, కార్యదర్శి ధనుంజయరావు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు 30 మంది ఎంపిక

ఇచ్ఛాపురం: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఆర్‌టిఇ యాక్టు ప్రకారం ఉచిత విద్యను పొందడానికి మొదటి విడత జాబితాలో 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఇఒలు కురమాన అప్పారావు, విశ్వనాథం గురువారం తెలిపారు. వీరికి కేటాయించిన ప్రైవేటు పాఠశాలల్లో గురువారం నుంచి జూన్ 7 లోగా చేరాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆర్‌టియు యాక్టు ద్వారా ఎంపికైన విద్యార్థులను నేరుగా ఎపి ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశానుసారం జాయిన్ చేసుకోవాలన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికీ నేరుగా ఫోన్ ద్వారా సమాచారం అందించామన్నారు.

చంద్రబాబును కలిసిన 'పిన్నింటి'

రణస్థలం రూరల్: సిఎం చంద్రబాబును కడపలో నిర్వహిస్తున్న మహానాడులో ఆ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. మరోసారి టిడిపి జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని భానుని చంద్రబాబు సూచించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారందరికీ భవిష్యత్ ఉంటుందని హామీఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మెంటినెన్స్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వజ్రపుకొత్తూరు విద్యుత్ శాఖ ఎఇ జి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అక్కుపల్లి, బైపల్లి, గరుడుభద్ర, మెట్టూరు తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. నియోగదారులు గుర్తించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పలాస : కాశీబుగ్గ చినబడాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పలాస విద్యుత్ శాఖ ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస నగర్, అనంతపురం, జిఎంఇ కాలనీ, కొబ్బరి చెట్లూరు, ఆర్.కె.పురం, పెంటిభద్ర, జయా రామచంద్రపురం, పద్మనాభపురం, పాతజాతీయ రహదారి, తాలభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం అంతరకుడ్డ, రాజపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

పొందూరు: మండలంలోని కింతలి, తాడివలస విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని వ్యవసాయ మోటార్లకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ పరిధిలో గల 132/33 కెవి లైన్ మరమ్మతుల కారణంగా వ్యవసాయ మోటార్లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యువకులు

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని లండారిపుట్టుగకు చెందిన రేషన్ డీలర్‌పై గ్రామానికి చెందిన యువకులు తహాశీల్దార్ మురళీ మోహన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో చాలామంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన లబ్ధిదారులకు మే నెలకు సంబంధించి రేషన్ పంపిణీ ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడమే కాకుండా తాను సొంత డబ్బులతో రేషన్ ఇప్పిస్తానని చెప్పి ప్రజల్ని మోసం చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. అతనిపై తక్షణమే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. అనంతరం యువకులు మాట్లాడుతూ గతంలో కూడా రేషన్ డీలర్ చాలా అవకతవకలు చేశాడని, దీనిపై ప్రశ్నిస్తే ఎస్‌సి, ఎస్‌టి కేసులు పెడతామని బెదిరిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో రేషన్ డిపో ఉన్నా... సరుకులు తమ గ్రామంలో నిల్వ ఉంచకుండా బయట ప్రదేశాల్లో ఉంచి కొద్ది మొత్తంలో మాత్రమే రేషన్ పంపిణీ చేస్తున్నట్టు యువకులు ఆరోపించారు. దీనిపై తక్షణమే విచార చేసి అతన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పూర్తిస్థాయిలో అందరికీ రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువకులు ఎన్.పాపారావు, ఎన్.యర్రయ్య, ఎం.ఈశ్వరరావు, ఇ.చిరంజీవి, ఎం.కృష్ణారావు, ఎన్.జగదీష్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

మందస: మండలంలోని బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన 30 రోజుల వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసిందని హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు విద్యార్థులను, ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గ్రామస్తులను అభినందించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు ఎస్.ఉమాపతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తామని అన్నారు. పాఠశాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులను జ్ఞాపికలతో సత్కరించారు. బోధించిన అంశాలపై విద్యార్థులకు గ్రాండ్ టెస్టు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గామ కమిటీ ఉపాధ్యక్షులు కర్రీ తాతారావు, క్యాషియర్ రాపక కేశవరావు, ఎస్ఎంసి చైర్మన్ కరగాన వల్లభరావు, ఉపాధ్యాయులు సార భాస్కరరావు, దాసరి ఈశ్వరరావు, వంకల పాపారావు, రాపాక వల్లభరావు, శాలిన శ్రీహర్ష పసు పురెడ్డి కాంతారావు, సాలిన శిరీష, భాష్యం మోహనరావు పాల్గొన్నారు.

విజేతలతో ఉపాధ్యాయులు

పలువురు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురం పంచాయతీ సింహాద్రిపురంలో ఇటీవల మృతి చెందిన సనపల చక్రధర్ కుటుంబానికి 'మేము ఉన్నాము. మీకేమి కాదని' తన తోటి విద్యార్థులు ధైర్యం చెప్పి ఆదుకున్నారు. 1999–2000 విద్యా సంవత్సరం జర్జంగి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ తమ మిత్రుని మరణ వార్త విని, ఆయన పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం రూ.80 వేలు ఆర్థికసాయం గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆయన చిన్ననాటి మిత్రులు గొండు నారాయణరావు, గుంట సోమేశ్వరావు, కూన కోటేశ్వరరావు, కిల్లి అరవింద్, తిర్లంగి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఈ నెల 26న కంచిలి మండలం చిల్లపుట్టిలో విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి చిన్నమొత్తంలో ఆర్థికసాయం అందజేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులను కలిసి ప్రభుత్వపరంగా పరిహారం ఇప్పించాలని కోరారు.

కొండవలసలో వికసిత కృషి సంకల్ప అభియాన్

సరుబుజ్జిలి: మండలంలోని కొండవలసలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఖరీఫ్ పంట కాలంలో రైతులు పాటించాల్సిన పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విత్తనాల ఎంపిక, వాటి లభ్యత, వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొత్తూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బొడ్డేపల్లి రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి నిర్వహించారు. రైతులు అడిగిన పలు సందేహాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు బాలకృష్ణ, శైలజ, అనూష సమాధానాలు ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలైన చేపల పెంపకం, పశుపోషణ, కోళ్ల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో కెవికె భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాల క్షేత్రస్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

4న 'వెన్నుపోటు దినం' ర్యాలీ

మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిందని, వారి తరుపున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జూన్ 4న మాజీ సిఎం, వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎచ్చెర్ల నియోజకవర్గ కేంద్రంలో తలపెట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, సమన్వయ కర్త గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రణస్థలం వైసిపి కార్యాలయంలో గురువారం నాలుగు మండలాల వైసిపి మండల పార్టీ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచిందని, అందుకు నిరసనగా పార్టీ శ్రేణులంతా ర్యాలీగా వెళ్లి నియోజకవర్గస్థాయి అధికారులకు మెమోరాండం సమర్పించే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అవ్వాలని కోరారు. ఎంపిపిలు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డుమెంబర్లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల అనుబంధ విభాగాల కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజలు తరుపున పోరాడాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు మండలాలు వైసిపి మండల అధ్యక్షులు దన్నాన రాజీనాయుడు, గొర్లె శ్రీనివాసరావు, బోర సాయి రామ్ రెడ్డి, డోల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొర్లె కిరణ్ కుమార్


విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న ప్రభాకరరావు

విద్యార్థులతో యోగాసనాలు

శ్రీకాకుళం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విశ్రాంత ఉపాధ్యాయుడు బి.ప్రభాకరరావు విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ప్రాణాయామం, వజ్రాసనం వంటి వాటితో శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో బాగుంటుందన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వివిఐఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అప్పలరాజు (ఫైల్)

మండల పరిధిలో చిలకపాలెం గ్రామానికి చెందిన ఇనుము అప్పలరాజు (47) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎచ్చెర్ల పోలీసుల వివరాల మేరకు అప్పలరాజుకు మద్యం సేవించే అలవాటు ఉందని, రోజు ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడేవాడన్నారు. ఈ క్రమంలో ఈనెల 26న చావు కార్యక్రమానికి వెళ్లి అప్పలరాజు అక్కడ మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో భోజనం చేయకుండా రాత్రి నిద్రపోయాడు. మరుసటి రోజు తెల్లవారి చిలకపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయి ఉండడంతో గమనించిన చిన్నాన్న రామరాజు చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించినట్టు తెలిపారు. అప్పలరాజుకు భార్య భారతి, కుమారుడు పవన్ కుమార్ ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రానికి వచ్చిన విత్తనాలు

విత్తనాలు, ఎరువులు సిద్ధం

కోటబొమ్మాళి: ఖరీఫ్‌లో వరిసాగు చేసుకొనే రైతులకు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై అందించేందుకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎఒ ఎస్.గోవిందరావు గురువారం తెలిపారు. ఎంటియు 7029, బిపిటి 5204, ఎంటియు 2241, ఎంటియు 1061, ఎంటియు 1064 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటిసారి వేసే ఎరువులు యూరియ, డిఎపిలు రైతు సేవాకేంద్రాల్లో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా వస్తున్న కాంపోస్ట్ పిట్స్, రైతులు పొలాల్లో నిర్మించే ఫారం ఫాన్స్ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న రైతులకు ఉపయోగపడే ఫారం పండ్స్. కాంపోస్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టి.రాంబాబు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యం

ఆమదాలవలస: సిఎం చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షులు బి.వి. రామ్ అన్నారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఆపాలన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలోకి రావాలని ఎదురు చూస్తున్నారన్నారు. కడపలో నిర్వహిస్తున్న మహానాడు అద్భుతంగా జరుగుతోందని, ఈ ఉత్సాహాన్ని చూసి వైసిపి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. అనంతరం బి.వి.రామ్, ఎన్‌టిఆర్ హయాంలో మంత్రిగా పనిచేసిన మాజీమంత్రి గుండు అప్పల సూర్య నారాయణను అరసవల్లిలోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు.

పాఠ్య పుస్తకాల ప్యాకింగ్ పనులను పర్యవేక్షిస్తున్న ఎంఇఒ

పాఠ్య పుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికి ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీకి ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. గురువారం లావేరు జడ్‌పి పాఠశాలలో ఉన్న పాఠ్యపుస్తకాలను పాఠశాలల వారీగా ఎన్ని పుస్తకాలు, విద్యార్థులు ఎంతమంది, ఏయే తరగతి ప్రకారం సర్దుబాటు చేసి సంచుల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మొత్తం ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పిలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా డాగ్ స్క్వాడ్ తనిఖీలు

పొందూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా గురువారం ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మండలంలోని పొందూరు బస్టాండ్, రాపాక సెంటర్, రాపాక, లోలుగు, లోలుగు సెంటర్లలో తనిఖీలు జరిపారు. గంజాయి, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు వంటి వాటిని వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

గోతులు పూడ్చివేత

కొత్తూరు: మండల కేంద్రమైన అలికాం-బత్తిలి రహదారిలోని గ్రామీణ బ్యాంకు వద్ద ఐదేళ్ల నుంచి రోడ్డుపై గోతులమయమైంది. దీంతో పాదచారులకు, వాహనదారులకు రాకపోకలకు తీవ్రంగా అంతరాయం కలుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని దుర్గా నీలమణి లారీ యూనియన్ సహకారంతో సుమారు రూ.30 వేలు ఖర్చుతో గోతులను గురువారం పూడ్చివేశారు. దీంతో కొంత ఉపశమనం కలిగింది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి ఇరువైపుల కాలువలు నిర్మించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోతులను పూడ్చుస్తున్న యూనియన్ నాయకులు